డబ్బు గణేశ్వరరావుకి వప్పగించి అప్పటికి ఉన్న అప్పులన్నీ తీర్మానం చేయించేశారు.

నాటికి నేడు గణేశ్వరరావు అత్యవసర పరిస్థితుల్లో నా దగ్గిర మూడంటే మూడు వందలు అప్పు తీసుకుంటూ; "ఇది నీకు ఖచ్చితంగా, పైనెల పదకొండో తారీకుని నువ్వు హైదరాబాదు వచ్చినప్పుడు ఇచ్చేస్తాను." అన్నాడు.

మొన్న పదకొండో తారీకుని హైదరాబాదు వెళ్లేను. "రైలు దిగి తిన్నగా మీ ఇంటికి వచ్చేస్తాను" అని ఉత్తరం రాసేను కదా అని ఆ ప్రకారం వెళ్లగా; అతను కాపురం ఉండే ఇంటి తలుపుకి "టు-లెట్" బోర్డు పెట్టివుంది. ఈ మాత్రం దానికి మేడమీదకి వెళ్లడం దేనికని, కిందని కూర్చున్న ఆ ఇంటి వోనర్‌గార్ని "వీళ్లు ఎక్కడికి మారిపోయారు?" అని అడిగాను. "ఏమో తెలీదండి" అన్నాడాయన.

ఆఫీసుకెళ్లి కనుక్కుందామంటే ఆదివారం అయింది. సరేకదా అని వేరే చోట మకాం చేసి సోమవారం నాడు గణేశ్వరరావు ఆఫీసుకి ఫోన్ చేశాను. "ఆయన సెలవులో ఉన్నారండి." అని జవాబు వచ్చింది. నేను మకాం చేసిన చోట ఉన్న టెలిఫోన్ నెంబరు ఇచ్చి: పధ్నాలుగో తారీకున నేను విశాఖపట్నం వెళ్లిపోతున్నాననీ, వీలుంటే ఆ లోగా ఫోన్ చెయ్యమని చెప్పమనీ చెప్పేను. ఫోన్‌లో మాట్లాడినాయన నేను ప్రయాణం చేసే రైలు, అందులో బోగీ నెంబరు, అందులో బెర్తు నెంబరు అడిగి రాసుకున్నాడు.

పధ్నాలుగో తారీకునాడు నాంపల్లి స్టేషన్‌లో "గోదావరి ఎక్స్‌ప్రెస్ బయలుదేరుటకు సిద్ధముగా యున్నది" అని అనౌన్సు చేసిన వేళకి గణేశ్వరరావు ఒగర్చుకుంటూ వచ్చేడు. హడావుడిగా మూడు వంద రూపాయల నోట్లు జేబులోంచి తీసి నాకు ఇచ్చి "సారీ; మూడు వందలు; మూడు రోజులు ఆలస్యం - "అంటూ అలసిపోయాడు.

బండి బయలు దేరింది.

"అదిసరే; ఇల్లు మారావుట కదా? కొత్త అడ్రస్ నాకు రాయలేక పోయావా?" అన్నాను.

"ఇల్లు మార్లేదు. అక్కడే ఉన్నాను. నీకివ్వాలని మా ఇంటివోనర్ని మూడు వందలు అడిగితేను; మూడు రోజుల తరువాత గానీ ఇవ్వలేనని చెప్పి, ఈలోగా నువ్వొచ్చి అడిగేస్తావేమో అంటే; 'అదంతా నేను చూసుకుంటాన్లే' అని- అతనే మా తలుపుమీద ఉన్న నా నేమ్‌బోర్డు తీయించేసి టు-లెట్ బోర్డు పెట్టాడు." అని-

పరుగెడ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలుతో సమానంగా పరుగెత్తలేక; దూరం అయిపోతూ కొంచెం కొంచెంగా గొంతెత్తి అరుస్తూ చెప్పాడు గణేశ్వరరావు. ★

# 104. నంచుకు తిందాం, రండి!

"రెరెరెరె! ఇరణ్య కసిపుడరా, నిన్ను-
ఇరసక తింటనురా!"
"హొరెవొరె! నర్సిమ్మసామినిరా, నిన్ను -
నంచుక తింటనురా!"

అని రెండు చరణాలున్న పాట వొకటి, పేరు జ్ఞాపకం లేదు గాని; ఒక తెలుగు సినిమాలో పాడించేరు.

నంచుకు తినడం అనేది మన భోజన సంప్రదాయంలో ఒక ప్రముఖమైన అలవాటుగా ఉంటోంది. పప్పూ అన్నం కలుపుకొని దాంట్లో పురిషెడు నెయ్యి వేసుకున్నా సరే; అది ముద్దలు ముద్దలుగా చేసుకుని తినేటప్పుడు, కొంచెం "ఆవుపిండి" గాని కనీసం "ఊరుపిండి"గాని నంచుకుంటూ తినడం అదో మజా. ఈ మధ్య నా స్నేహితుడు ఒకాయన "ఆవుపిండి"ని "ధేను చూర్ణం" అనీ "ఊరుబిండి"ని "గ్రామచూర్ణం"అనీ సంస్కృతీకరించేడు. ఆవుపిండి అనేది నిజానికి "ఆవ-పిండి" అయినా ఉచ్చారణా సౌలభ్యం కోసం ఆవుపిండిగా విపరిణామం చెందింది. అలాగే ఊరుబిండి అనేది తెలకపిండిని ఊరవేసి వెల్లుల్లీ వామూఉప్పూకారం నిమ్మరసం చేర్చి పెట్టే పిష్టం - ఇప్పుడు అరుదైపోయిందిగాని కన్యాశుల్కం నాటకంలో దీని రిఫరెన్సు వుంది. (చూ:నాలుగవ అంకం; లాస్ట్ బట్ సెకండ్ డయిలాగ్!)

పప్పూ అన్నం చప్పగా ఉన్నందువల్ల కొంచెం పుల్లపుల్లగా వర్రవర్రగా ఏదైనా నంచుకుంటే నాలుకకి 'హితవు'గా వుంటుంది. తూర్పు సీమలో "కారంగా" అనేది "వర్రగా" అనే రూపాంతరంలో వాడుకలో వుంది. రూపాంతరం అంటే కారంలో ఉండే ఎర్రరంగు మారిపోతుందని కాదు. 'ఎర్ర' అనే శబ్దమే 'వర్ర'గా విపరిణామం చెంది ఉండవచ్చు. ఆ మధ్య ఒకసారి వరవరరావుగారు విశాఖపట్నం నొచ్చి ఏదో సభలో మాట్లాడినప్పుడు నా శ్రీకాకుళం ఫ్రెండొకాయన - ఈయన ఉపన్యాసానికి తగ్గట్టుగానే ఈయన వర్రవర్రరావు అని పేరు పెట్టుకున్నారండోయి - అన్నాడు నాతో. ఆ పేరు ఆయనకి చిన్నప్పట్నుంచీ ఉన్నదే అనీ, దాని అర్థం ముఖ్యుల్లో ముఖ్యుడు అనగా శ్రీవిష్ణుమూర్తి వారు అనీ అతనికి బోధపరిచే సరికి నాకు తలప్రాణం కాలికొచ్చింది. అలాగే; మజ్జిగాన్నం మాంఛి కమ్మగా ఉన్నా, కొంచెం పుల్లగా ఉన్నా సరే, దాంట్లో ఏదో ఒకటి నంచుకోకుండా ఎంత పేదవాళ్లయినా సరే తినరు. అయితే ఉప్పూ, కారం, పులుపు అనే ముఖ్యమైన మూడు రుచులూ గుప్పించి చేసిన పదార్థాల్లో కూడా ఏదో ఒకటి నంచుకుంటూ తినడం "అభిరుచికి", లేదా స్టేటస్‌కి చిహ్నం అవుతుంది. అభిరుచి అంటే టేస్టు : కాని టేస్ట్ అంటే రుచే! మా అన్నగారు సూన్నాణమూర్తిగారు ఇంగువ, జీలకర్ర, కారం, ఉప్పు వేసి తయారుచేసిన కందిపొడి అన్నంలో నంచుకుందికి వంకాయ పులుసు పచ్చడి (నీరుల్లిపాయల ముక్కలు వేసి) చెయ్యమంటారు. అవన్నీ చెయ్యడానికి వోపిగ లేని నాడు మా వదిన ఆయన కంచానికి దగ్గిరిసా చేసి ఇన్ని నీరుల్లిపాయ ముక్కలు, మధ్యాన్నం పూట చేసిన పులుసు, "ఆవుపిండి" అమర్చి పెట్టుంది; ఏదో ఒకటి నంచుకు తినమని. కందిపొడి అనేది ఎక్కడో మద్రాసు హోటళ్లలో తప్ప సాధారణంగా రాత్రి భోజనంలోనే తింటారు. అన్నట్టు; "కందిపొడి"ని కొన్ని ప్రాంతాల్లో "కంది సున్ని" అని కూడా అంటారు. బ్రౌన్ దొరగారు ఓసారి కృష్ణాజిల్లాలో ఒకరింట్లో డిన్నర్ (రాత్రి భోజనం) చేసినప్పుడు విస్తట్లో కందిపొడి వడ్డించారనీ; ఆ "డిష్"ని (వంటకాన్ని) బాగా ఎంజాయి చేసిన దొరగారు మర్నాడంతా తమకి అనుభవంలో కొచ్చిన దేహస్థితిని అనుసరించి ఆ పదార్థానికి గన్‌పౌడర్ (తుపాకి మందు) అని నామకరణం చేసేరని ఒక కథ మా పెదనాన్నగారు చెప్పేవారు.

కందిపొడి అన్నం సంగతి అలా ఉంచితే - చిక్కటి పప్పుపులుసూ అన్నంలో పేరిన నెయ్యి నంచుకోడం, మాహిషంచ శరచ్చంద్ర చంద్రికా ధవళమైన గడ్డ పెరుగు అన్నంలో బంగినిపిల్లి మామిడిపండు ముక్కలు నంచుకోడం, కొరివి కారం అన్నంలో ముద్దపప్పు నంచుకోడం ఇలాటివి

మన భోజన సంప్రదాయంలో అలవాట్లుగా నెలకొని స్థిరపడి వున్నాయి.

భోజనం అంటే భోజనమే కాదుగా! "చిరు తిళ్లు" కూడా భోజనం కిందకే వస్తాయి. "చిరుతిళ్లు' అనేమాటని గౌరవప్రదంగా భావించని వాళ్లు వాటిని "ఫలహారాలు" అంటారు. రాత్రికి ఏం తింటారు. అంటే "ఫలహారం" అని కొందరు స్వాములు (స్వామినులు కూడా) నిర్దేశిస్తారు. "వాములు తినే స్వాములకు పచ్చిగడ్డి ఫలహారమా" అనీ; "తలుపులు తినే బావగారికి అప్పడాలు ఫలహారం పెట్టినట్టు" అనీ సామెతలు ఉన్నాయి. ఇప్పుడూ అక్కడక్కడ ఉన్నాయేమోగాని, కొన్నాళ్ల కిందటి వరకూ; మనం యిప్పుడు రెస్టారెంట్స్ అని పేర్కొంటున్న తిండి దుకాణాలకి "ఫలహార శాల"అని బోర్డులుండేవి. మరీ అధునాతనమైన రెస్టారెంట్స్‌లో ఫ్రూట్ సెలాడ్ అనే నిజమైన "ఫల-హారం" లభ్యమైతే కావచ్చు గాని, "ఫలహార శాల"ల్లో చిరుతిళ్లే ఉంటాయి. ఈ చిరుతిళ్లలో సాధారణంగా ఉదయం ఐటమ్స్, మధ్యాన్నం ఐటమ్స్, సాయంకాలం ఐటమ్స్ వేరు వేరుగా ఉంటాయి. ఇడ్లెన్లు, ఉప్మా, పుల్లట్టు (ప్లెయిన్ దోశ!), పెసరట్టు, మసాలాదోశ, రవ్వట్టు, పూరీ, గారె, బోండా, బజ్జీ, బూందీ, కారపూస, ఇలా ఎన్ని రకాలో! కులాల్లో మళ్లీ శాఖలు ఉన్నట్టు రవ్వ ఇడ్లీ, సేమ్యా వుప్మా, టమాటాబాత్, మిక్స్‌చర్ పెసరట్టు, ఉల్లి మినపట్టు, ఉల్లి (కొబ్బరి) రవ్వట్టు, మసాలా గారె, మైసూర్‌బజ్జీ ఇలా శాఖలు కూడా ఉంటాయి. మా వూళ్లో ఒక ఫలహార శాలలో కేవలం పెసర పుణుకులూ చల్ల పొంగరాలూ మాత్రం ఉంటాయి. (చల్ల పొంగరాలు - అంటే అటుకులూ బియ్యం నానబెట్టి రుబ్బి, కొంచెం పులుపెక్కాక వేసే దళసరి అట్టు; పెనం మీద వేసి కొద్దిలోతున్న పళ్లెం మూతపెడితే "అట్టుడికినట్టు ఉడకడం" దీని లక్షణం) చెప్పొచ్చేదేమిటంటే, ఏ "పకోడి"కో స్వీటుకో తప్ప, మిగిలిన అన్ని పదార్థాలకీ విధిగా "నంచుకుందికి" ఏదో ఏర్పాటు ఉండితీరుతుంది. కొబ్బరిపచ్చడి, అల్లప్పచ్చడి, శనగపిండి పచ్చడి, సాంబారనబడే పప్పుపులుసు, బంగాళాదుంప - ఉల్లిపాయ కూర, "కుర్మా" - ఇలా ఎన్నిరకాలో కనిపెట్టి మన అభిరుచి ఏమిటో కనిపెట్టి మరీ వడ్డిస్తారు. (కొన్నిచోట్ల అయితే ఎగ్‌స్ట్రా చెట్నీకి, ఎగ్‌స్ట్రా సాంబార్‌కి ఎగ్‌స్ట్రా కర్రీకి విడిగా బిల్లులు కూడా వడ్డిస్తారు) చల్ది కొంచెం ఊరగాయ ఘనం అన్నట్టు, "నంచుకుందికి" ఎక్కువ లాగించేవాళ్లకి ఈ శిక్ష న్యాయమే కదా. మన దేశంలోని ఫలహార వ్యవస్థను అర్థం చేసుకొన్న ఇంగ్లీషు వాడు "టిఫిన్" అని ఒకమాట సృష్టించి వదిలాడు; వాళ్లదేశాల్లో "స్నాక్స్" అనీ "బ్రేక్‌ఫాస్ట్" అనీ గౌరవప్రదమైన పేర్లు ఉన్నా సరే!

తిండికీ "నంచుగోను"కీ ఉన్న అనుబంధం అసలుకీ వడ్డీకీ ఉండే బాంధవ్యం వంటిదని చెప్పుకోవచ్చు. నలభై యాభై ఏళ్లకిందట ఎవరికైనా తమ పిల్లనిచ్చి పెళ్లి చేసే ప్రతిపాదన వస్తే "అబ్బాయికి తిండి వుందా?" అనే ప్రశ్న, "తిండి వుంది; నంచుకుందికీ వుంది!" అనే జవాబూ వుండేవి. నంజుడు - అనే మాటకి మాంసం అనే అర్థం ఉంది.

కొన్నాళ్ల కిందట మా వూళ్లో ఒక సంస్థకి మేనేజింగ్ డైరెక్టరుగా "నంజుండయ్య" అనే ఆయన్ని నియమించారు. ఆయనకి స్వతహాగా "జీతం" కంటే "గీతం" ఎక్కువగా ముట్టేది. కాని కింది ఉద్యోగులు ఎవరయినా తను "చెప్పినట్టు" చెయ్యకుండా తను "చేసినట్టు" చేస్తే మాత్రం వాళ్లని "నంచుకు తినేసేవాడు".

★